క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



గుడివాడ టౌన్: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ సత్కారం పొందిన తెలుగు ఉపాధ్యాయుడు కావూరి శ్రీధర్‌ను మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ఉపాధ్యాయులు మంగళవారం సత్కరించారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని హిందూ ఉపాధ్యాయ సమితి కావూరి శ్రీధర్‌ను కర్నూలులో సోమవారం వ్యాస మహర్షి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించారు. దీనిని పురస్కరించుకుని ఎంఈఓ–2 బి. బాలాజీ, మాంటిస్సోరి హైస్కూల్ హెచ్‌ఎం జి.పద్మావతి అభినందించి సత్కరించారు.

త్రివేణి స్కూల్ విద్యార్థుల ప్రతిభ



గుడివాడరూరల్: ఇటీవల మైసూర్‌లో జరిగిన భగవద్గీత జాతీయ స్థాయి పోటీల్లో త్రివేణి స్కూల్ విద్యార్థి కె.వెంకటనాగ అక్షయ బంగారు పతకం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శివశంకర్ తెలిపారు. అదేవిధంగా యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కైకాల కళామందిరంలో జరిగిన యోగా ప్రాముఖ్యత–ప్రయోజనాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో తమ విద్యార్థిని ఎం.దివ్యశ్రీకి ప్రథమ బహుమతి, పి.మోక్షిత్‌కు ద్వితీయ బహుమతి వచ్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శివశంకర్ తెలిపారు. స్థానిక పాఠశాల్లో మంగళవారం బహుమతులు సాధించిన విజేతలను అభినందించారు.

స్వచ్ఛ గుడివాడకు కృషిచేద్దాం



గుడివాడ టౌన్: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో తాము సైతం స్వచ్ఛందంగా కృషి చేస్తున్నామని రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ అధ్యక్షుడు టి.ఎస్.రాజశేఖర్ అన్నారు. ఐ లవ్ గుడివాడ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక 6వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో ర్యాలీ నిర్వహించి స్థానికులకు అవగాహన కల్పించారు. చెత్త, పిచ్చి మొక్కలు తొలగించడం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచన మేరకు రోటరీక్లబ్ గుడివాడ ఈ కార్యక్రమాలను స్వచ్ఛందంగా చేపట్టిందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జి.కిరణ్‌బాబు, పొన్నూరు రామకృష్ణ, మారుతీకుమార్, ఎ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, వి.రామకృష్ణ, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



మొవ్వ: ఉపాధి హామీ పథకం కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఏపీ కౌలు రైతు సంఘం కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు రైతులతో కలిసి డిమాండ్ చేశారు. మొవ్వ మండలం కాజలోని ఉపాధి హామీ కూలీలతో కలిసి పంచాయతీ కార్యదర్శి ఏడీవీఎల్ ప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఎనిమిది వారాలు పని చేసినా తమకు ఒక్క రూపాయి కూడా వేతనం రాలేదని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికీ 200 పని దినాలు కల్పించాలని, ఉపాధి హామిని పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు కరుణాకర్‌బాబు, యేసుబాబు పాల్గొన్నారు.

ఆమోదయోగ్యంగా బడ్జెట్



గుడివాడ టౌన్: కేంద్రంలో నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ ఆమోదయోగ్యంగా ఉందని బీజేపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎర్రపోతు అర్జున్, జిల్లా కార్యదర్శి అంగడాల సతీష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూరే గాంధి పాల్గొన్నారు.

పొలాల్లోని మురుగునీరు తొలగించాలి



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి

పామర్రు(తోట్లవల్లూరు): వారం రోజులుగా కురిసిన వర్షాలతో నారుమడులు, వెదసాగు వరి పంటలో నిలిచిన వర్షం నీటిని బయటకు మళ్లించే ప్రయత్నాలు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతి పేర్కొన్నారు. తోట్లవల్లూరు మండలంలోని భద్రిరాజుపాలెం గ్రామంలో ముంపుబారిన పడిన వరి పొలాలను వ్యవసాయశాఖ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మునిగిన వరి నారుమడిలో ఐదు రోజుల్లో నీటిని తొలగించాలన్నారు. ఐదు సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్ కలిపి చల్లాలన్నారు. అంతేకాకుండా కార్బండిజం రెండు గ్రాములు, మాంకోజెబ్ రెండు గ్రాములు కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. నాట్లు వేసిన వరి పొలాల్లో బూస్టర్ డోస్‌గా 20 కేజీల యూరియా, 15 కేజీల ఎంటీపీలను పొలం అంతా సమపాళ్లలో చల్లు కోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఉయ్యూరు చెరకు పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి, మచిలీపట్నం జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ పద్మజ, పామర్రు ఏడీఏ బి.స్వర్ణలత, ఏఓ నాగేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఉద్యాన వన పంటల పరిశీలన



తోట్లవల్లూరు మండలం ఐలూరు రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు మంజువాణి, పద్మావతి

పమిడిముక్కల: మండంలోని ఐనపూరు, లంకపల్లి, తోట్లవల్లూరు మండలం ఐలూరు గ్రామాల్లో సాగు చేస్తున్న ఉద్యాన వన పంటలను మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన వన విభాగం శాస్త్రవేత్త మంజువాణి, వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త పద్మావతి పరిశీలించారు. మిరప, బొప్పాయి, అరటి, పసుపు, కంద, బీర, చెరకు పంటలను పరిశీలించారు. గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాల కారణంగా పంటల ప్రస్తుత పరిస్థితిని గమనించారు. పంటలో నీరు నిల్వలేకుండా చూడాలని రైతులకు సూచించారు. మిరప పంటలో పైపాటుగా 50 కిలోల యూరియా, 25 కిలోల ఎంటీపీ, 100 కిలోల వేపపిండిని వేయాలని తెలిపారు. కందలో ముందస్తు జాగ్రత్తగా నేల, కాండం, మొక్కలపై కాపర్ ఆక్సీ క్లోరైడ్ మూడు గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. బొప్పాయిలో మొక్కలు వైరస్ తెగుళ్ల తట్టుకునే విధంగా సమగ్ర సస్యరక్షణతో పాటు, సూక్ష్మధాతు మిశ్రమం ఐదు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయలని శాస్త్రవేత్తలు తెలియజేశారు.

మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పుష్ప యాకోబ్

రావర్ల(పామర్రు): ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని మదర్‌థెరిస్సా ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్.పుష్ప యాకోబ్ అన్నారు. మండలంలోని రావర్ల గ్రామంలోని మదర్‌థెరిస్సా పాఠశాలలో విజేతలను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన మొదటి ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాపియన్‌షిప్‌లో కుంగ్–ఫూ కరాటే అంతర్జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో మూడో తరగతి చదువుతున్న జీ సిద్ధార్థ మొదటి బహుమతి గెలుచుకుని బంగారు పతకం, సర్టిఫికెట్, వీ ఆకాష్ ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్, టీ జయవర్ధన్, నాలుగో తరగతికి చెందిన ఏ భువనేష్ తృతీయ స్థానం సాధించి బ్రాంజ్ మెడల్ సాధించారని తెలిపారు.

కార్యదర్శులకు ఉద్యోగోన్నతి

ముదినేపల్లి రూరల్ : మండలంలోని నలుగురు గ్రేడ్–3 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్–2 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి లభించింది. దీంతో వీరిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెదపాలపర్రు కార్యదర్శి షేక్ షహనాజ్‌బేగం వడాలి, చేవూరు, పెయ్యేరు కార్యదర్శులు బి.రమేష్, పి. నాగలక్ష్మి, వై. శ్యాంసుందర్‌కు ఉద్యోగోన్నతి లభించింది. వీరిలో షహనాజ్‌బేగంను ఏలూరు జిల్లాకు, మిగిలిన ముగ్గురు కార్యదర్శులను కృష్ణా జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



తాగునీటి చెరువుకు నీరు నింపుతున్న పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ ఝాన్సీ

మండవల్లి: గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్టు సర్పంచ్ మెండా ఝాన్సీ పేర్కొన్నారు. మండవల్లిలో మొగలిచెరువులో నీటిని నింపే పనులను ఆమె మంగళవారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

కైకలూరు: నత్తగుల్లపాడు గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ నబిగారి ఏడుకొండలు, వార్డు సభ్యులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 2020లో గ్రామం పంచాయతీగా ఏర్పడిందని, ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆశించగా అందుకు విరుద్ధంగా వెనుకబడిపోతున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి సర్పంచ్ ప్రజలకు అందుబాటులో లేకుండా ఇష్టానుసారం పాలన సాగిస్తున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. పంచాయతీ పాలకవర్గ సమావేశాలు సైతం సక్రమంగా నిర్వహించడం లేదని పాలనా వ్యవహారాలపై విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

వైస్ ఎంపీపీకి పరామర్శ



జహీర్‌ను పరామర్శిస్తున్న డీఎన్నార్

కైకలూరు: ప్రమాదవశాత్తు గాయపడి ఏలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్‌ను, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) మంగళవారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను కలిసి ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. డీఎన్నార్‌తో పాటు మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు పంజా రాంబాబు, సింగంశెట్టి రాము ఉన్నారు.

ఆఖిరి మజిలీ.. అభివృద్ధి

శ్మశానవాటికను సుందరంగా తీర్చిదిద్దిన గ్రామస్తులు



సింగలూరు గ్రామస్తులు తీర్చి దిద్దుకున్న శ్మశాన వాటిక

గుడ్లవల్లేరు: మనిషి పుట్టాక తన జీవితంలో ఎన్నో కష్టాలు.. ఎలా బతుకుతాడో తెలియదు.. కనీసం మరణించాకైనా ఆ భౌతికకాయానికి మర్యాద ఇవ్వాలి. అందుకే పెద్దలు దహనం చేసే విధానానికి కూడా దహన సంస్కారాలు అనే పేరు పెట్టారు. అదే మర్యాదను ఆ గ్రామస్తులు ఇస్తున్నారు. అక్కడికి వచ్చేవారు ఇబ్బందులు పడకాకుండా ఆ గ్రామంలో శ్మశానాన్ని సుందర వనంగా గ్రామస్తులు తీర్చి దిద్దుకుంటున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉండే సింగలూరు గ్రామంలో గతంలో శ్మశాన వాటిక లేదు. దారీ డొంకా సరిగా లేనటువంటి మోకాలు లోతు దారిలో భౌతికకాయాలను తీసుకెళ్లాల్సి వచ్చేది. అలాంటి స్థితిలో ఉన్న గ్రామంలో ప్రముఖ సంఘ సేవకుడు, శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ బందారు శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సమష్టిగా శ్మశాన వాటికను అందంగా నిర్మించుకుంటున్నారు. ఆ గ్రామమే గుడ్లవల్లేరు మండలంలోని చంద్రాల శివారు సింగలూరు. శ్మశానంలోకి వెళ్లగానే అందరికీ శ్మశాన వైరాగ్యం వచ్చేస్తుంది. కానీ అలా కాకుండా ఈ శ్మశానంలోకి అడుగు పెట్టగానే ఆహ్లాదకరంగా ఉండేటట్లుగా గ్రామస్తులు తీర్చి దిద్దుకుంటున్నారు. శ్మశానానికి ప్రహరీగోడ, రహదారి, భారీ మహాశివుడి విగ్రహం, స్టోర్ రూమ్, దహనం చేయడానికి మందిరాన్ని గ్రామస్తులు సమకూర్చుకున్నారు. అలాగే ఇక్కడికి దహన సంస్కారాలకు వచ్చే వారి కుటుంబీకులు, బంధువులు విశ్రాంతి పొందేందుకు భవనాన్ని కూడా నిర్మిస్తున్నారు. ఈ శ్మశాన వాటిక ప్రహరీగోడ నిర్మాణానికి 2023లో ప్రభుత్వ నిధులు రూ.10 లక్షలు కేటాయించారు. త్వరలో ఈ ప్రాంతాన్ని మరింత అందంగా తీర్చి దిద్దేందుకు పూల మొక్కలు కూడా నాటనున్నారు.



నిర్మాణంలో ఉన్న విశ్రాంతి భవనాన్ని చూపుతున్న డాక్టర్ శ్యామ్‌కుమార్



క్రేన్‌తో శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న గ్రామస్తులు

దాత సహకారంతో విద్యోపకరణాల పంపిణీ

పామర్రు: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, భవిత కేంద్రాల విద్యార్థులకు దాత సహకారంతో మంగళవారం విద్యోపకరణాలను పంపిణీ చేశారు. మేడిశెట్టి వీరవసంతరావు, వీర రాఘవమ్మ జ్ఞాపకార్థం కుమారులు నాగేంద్ర, జగన్‌మోహన్‌రావు 32 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు యర్రంశెట్టి వీరాస్వామి, చినముత్తేవి రాఘవులు, పంచకర్ల అమర్ కుమార్, పాఠశాల హెచ్‌ఎం కె.లక్ష్మీకుమారి, భవితకేంద్ర నిర్వాహకులు కె.మరియన్న, ఎం.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్సీపీ రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్సీపీ రెడ్డి

గుడివాడరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి సమకూరిన ప్రయోజనాలు ఏమీ లేవని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్సీపీ రెడ్డి అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు మేలు చేకూరేలా లేదన్నారు. ముఖ్యంగా రాష్ట్రానికి సంబంధించి రాజధాని నిర్మాణానికి రూ.12వేల కోట్లు వివిధ సంస్థల నుంచి అప్పులు ఇప్పిస్తామని చెప్పారన్నారు. విభజన హామీల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేలా అధికార పార్టీ ఎంపీలు పోరాటం చేయాలని సీపీఎం తరపున డిమాండ్ చేస్తున్నట్లు ఆర్సీపీ రెడ్డి తెలిపారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న వీరమల్లు

ముదినేపల్లి రూరల్: ప్రమాదవశాత్తూ గాయపడ్డ చిరువ్యాపారికి మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు(బాబు) మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని వడాలికి చెందిన చిరు వ్యాపారి కొల్లిపర బాబురావుకు ప్రమాదవశాత్తు కాలు విరిగి గుడివాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో సర్జరీ జరిగింది. స్థానిక టీడీపీ నేతల ద్వారా సమాచారం అందుకున్న మాగంటి రూ.20 వేలను టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ద్వారా బాబురావుకు అందజేశారు.

ప్రత్యేక పూజలు

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో ఆషాఢ మాసం మంగళవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు, సహాయకులు ఫణికుమార్, శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జి ఈఓ సుధాకర్ పాల్గొన్నారు.

బొడ్డపాడులో పారిశుద్ధ్య పనులు



కాలువ రేవుల వద్ద పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

పామర్రు(తోట్లవల్లూరు): తోట్లవల్లూరు మండలం బొడ్డపాడు గ్రామంలో గ్రామస్తుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా మంగళవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. పంచాయతీ రాజ్ చాంబర్ కార్యదర్శి , బొడ్డపాడు గ్రామ సర్పంచ్ మూడే శివ శంకర్‌రావు ఆధ్వర్యంలో ఈ పనులను చేపట్టారు. గ్రామంలోని చెత్త తొలగింపు పనులు, కాలువల రేవుల బాగు చేత పనులను నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు: పల్లెవాడ, వరహాపట్నం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలకు బుధవారం ఉదయం ఎనిమిది నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ కె.రామకృష్ణ మంగళవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణరక్షణ



సదస్సులో మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ కో–ఆర్డినేటర్

కైకలూరు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధారణతో ప్రాణరక్షణ పొందవచ్చని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, యూత్ రెడ్‌క్రాస్ కో–ఆర్డినేటర్ ఎం.హరిప్రసాద్ అన్నారు. కళాశాలలో ప్రిన్సిపాల్ కె.సుజాత అధ్యక్షతన హెల్మెట్ ధారణపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు లైసెన్స్ కలిగి, హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. దీనిపై విద్యార్థులు వాహనదారులకు అవగాహన కల్పించాలని కోరారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టౌన్ ఎస్సై ఏఆర్‌కే రాజు మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా లైసెన్సు లేకుండా వాహనాలను నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ ఏఎస్సై మల్లికార్జునరావు, కళాశాల కామర్స్ విభాగాధిపతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలికలపై లైంగిక దాడులను అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గుడివాడ టౌన్: రాష్ట్రంలో బాలికలు, చిన్నారులపై జరుగుచున్న లైంగిక దాడులను తక్షణమే అరికట్టాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ సాధిక్ అన్నారు. విద్యార్థులతో కలిసి పట్టణంలో మంగళవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. అలా చేసినప్పుడే ప్రజల్లో చట్టం పట్ల భయం ఏర్పడి అరాచకాలు తగ్గుతాయన్నారు. తక్షణమే కొత్త ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టి బాలికలకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ సభ్యులు, ఆదిత్య డిగ్రీ కళాశాల, చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న ఉపసర్పంచ్

ముదినేపల్లి రూరల్ : మండలంలోని బొమ్మినంపాడు పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామ ఉపసర్పంచ్ పి.వెంకటేశ్వరరావు, పలువురు పాలకవర్గ సభ్యులు ఎంపీడీఓ గంగాధరరావుకు కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీ పరిధిలో మూడు నెలలుగా వీధి లైట్లు వెలగడం లేదని, తాగునీటి కుళాయిలు సక్రమంగా పనిచేయడం లేదని పేర్కొన్నారు. పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో ఎంపీడీఓను కోరారు.

సహకార సంఘాల ద్వారానే ఎరువులు

మచిలీపట్నం ఇన్‌చార్జి ఏడీఏ రమాదేవి

గూడూరు: ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తూ సహకార సంఘాలు ఎరువుల అమ్మకాలలో కీలక పాత్ర పోషించాలని మచిలీపట్నం ఇన్‌చార్జి ఏడీఏ ఎస్.రమాదేవి కోరారు. గూడూరు మండలంలోని సహకార సంఘ కార్యదర్శులతో ఎరువుల అమ్మకాలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. గూడూరు సహకార సంఘ ఆవరణలో నిర్వహించిన ఈ సమావేశంలో రమాదేవి మాట్లాడుతూ సొసైటీలలో అన్ని రకాల ఎరువులను ఉంచాలని, తప్పనిసరిగా స్టాక్ బోర్డులో ఎరువుల వివరాలు, వాటి ధరలు, ఎంత స్టాక్ ఉన్నది తెలిసేలా ఉంచాలన్నారు. వ్యాలిడిటీ ఉన్న, లైసెన్స్ కలిగి ఉండటంతో పాటు, రైతులకు సంతకంతో కూడిన రసీదులు ఇవ్వాలని స్పష్టం చేశారు. స్టాక్ రిజిస్టర్ కచ్చితంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి శివప్రసాద్, వీఏఏలు ప్రభాకర్, ఈశ్వర్, ప్రవీణ్, పవన్, సొసైటీల సీఈవోలు చక్రవర్తి, గణేష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.